సాక్షి వికారాబాద్

శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



సాగులో జాగ్రత్తలు ముఖ్యం

ఎడతెరపి లేని వానలకు పంటలు దెబ్బతినే అవకాశం ఉందని తాండూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ లక్ష్మణ్ అన్నారు. 10లో▸



డీజేలకు అనుమతి లేదు

గణేశ్ మండపాల వద్ద, నిమజ్జన సమయంలో డీజేలకు అనుమతి లేదని యాలాల ఎస్ఐ శంకర్ తెలిపారు. 10లో▸



మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించాలి

పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే ప్రతిష్ఠించి పూజించాలని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. 11లో▸

న్యూస్‌రీల్

'కోట్‌పల్లి'కి పోటెత్తిన పర్యాటకులు

అలుగుపైకి అనుమతి నిరాకరణ



బోటింగ్ చేస్తున్న యువత

ధారూరు: వరద ఉధృతి నేపథ్యంతో కోట్‌పల్లి ప్రాజెక్టు వద్దకు మూడు రోజులుగా పర్యాటకులను అనుమతించలేదు. గురువారం అనుమతించడంతో ప్రాజెక్టు వద్దకు యువత పోటెత్తారు. అయితే అలుగుపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అక్కడికి వెళ్లరాదని పోలీసులు ఆదేశించారు. బోటింగ్ చేయడానికి పర్యాటకులు పోటీపడ్డారు.

డీజీపీకి ఎకో గణపతి



డీజీపీకి గణపతి ప్రతిమను బహూకరిస్తున్న జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్: ప్రకృతి హితమే పండుగల పరమార్థమని కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లో డీజీపీ జితేందర్‌కు ఎకో గణపతి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే పూజించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలన్నారు. రంగుల గణపతుల వల్ల కాలుష్యం ఏర్పడుతుందన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా నరేష్



నవాబుపేట: రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా నవాబుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ నరేష్ ఎంపికయ్యారు. నరేష్ ఎన్నిక కావడంపై కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్వరస్వామి, తోటి సిబ్బంది సంతోషం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రస్థాయిలో మెరిసిన 'వడిచర్ల'

ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన సత్యం



పురస్కారం అందుకుంటున్న వడిచర్ల సత్యం

బొంరాస్‌పేట: విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, తెలుగు సాహిత్య సేవలు అందించిన మండలంలోని తెలుగు భాషా ఉపాధ్యాయుడు, కవి వడిచర్ల సత్యంకు ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేసింది. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా పురస్కారం, రూ.10 వేల నగదు బహుమతి అందుకున్నారు. జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో పురస్కారం పొందిన ఏకైక ఉపాధ్యాయుడు వడిచర్ల సత్యం కావడం సంతోషంగా ఉందని జిల్లా ఉపాధ్యాయులు, కవులు, అనంత వేదిక సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.


ఆక్రమణల తొలగింపు



దుకాణాలను తొలగిస్తున్న అధికారులు

కొత్తూరు: ఆర్‌అండ్‌బీ రోడ్డు సమీపంలో అక్రమంగా నిర్మించిన దుకాణాలను గురువారం మున్సిపల్ అధికారులు తొలగించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పట్టణంలో రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో ఈ కట్టడాలను తొలగించినట్లు వెల్లడించారు. విస్తరణ అనంతరం రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ పైప్‌లైన్లను వేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు చిరువ్యాపారులు సహకరించాలని కోరారు. కాగా దుకాణాల కూల్చివేతను వ్యాపారులు వ్యతిరేకించారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలా తమ డబ్బాలను ధ్వంసం చేస్తారని ప్రశ్నించారు. తమకు కొంత గడువు ఇవ్వాలని ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులను వారు కోరారు. రోడ్డు విస్తరణకు తాము వ్యతిరేకం కాదని, జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న డబ్బాలను తొలగించకుండా పనులు చేపట్టాలని విన్నవించారు.

సమాజ నిర్మాతలు గురువులు



మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న స్పీకర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది

- విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది
- స్పీకర్ ప్రసాద్‌కుమార్
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు, సన్మానం
- శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్: ఉపాధ్యాయులు దైవంతో సమానం.. అన్ని వృత్తుల్లోకెల్ల ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురు పూజోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి పురస్కారాలు అందజేసి సన్మానించారు. 39 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, మనోహర్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఈఓ రేణుకాదేవి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలన్నారు. చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. ఈ గురుతర బాధ్యతను మోస్తున్న ఉపాధ్యాయులను సన్మానించుకోవడం మన అదృష్టంగా భావించాలన్నారు. మహనీయులను ఆదర్శంగా తీసుకుని విద్యా బోధన చేయాలన్నారు. అంబేడ్కర్, జ్యోతిబాపూలే దంపతుల లాంటి గొప్పవారు ఆ రోజుల్లోనే విద్య యొక్క ప్రాముఖ్యతను గుర్తించి ఎన్నో అద్భుతాలు చేశారని పేర్కొన్నారు. వారిని స్మరించుకుంటూనే విద్యార్థులను ఆ దిశగా నడిపించాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో బడుల రూపురేఖలు మారుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లు, గురుకులాలు, మోడల్ స్కూళ్లలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.21 వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో 20 ఎకరాల్లో సమీకృత పాఠశాల భవన నిర్మాణాలకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని పేర్కొన్నారు. విద్య, ఆరోగ్యం కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు చెప్పారు.

మార్పులకు అనుగుణంగా బోధన జరగాలి

అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. సమాజ నిర్మాణ బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తే ఉత్తమ సమాజాన్ని చూడగలుగుతామని అన్నారు. నేడు సమాజంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, వాటికనుగుణంగా విద్యా బోధన జరగాలని సూచించారు. సమాజంలో విద్యకు మించినది ఏదీ లేదన్నారు. విద్యతో అద్భుతాలు సృష్టించవచ్చని.. దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ విద్యకు ఇచ్చిన ప్రాధాన్యతను ఈ సందర్భంగా గుర్తుచేశారు. జిల్లాలో 951 ప్రభుత్వ బడులు ఉండగా ఇప్పటి వరకు 250 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. అనంతరం ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఓ వ్యక్తి ఉన్నత స్థానంలో ఉన్నాడంటే అది గురువుల గొప్పదనమే అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని అన్నారు. తల్లిదండ్రుల తరువాత వారిదే గురుతర బాధ్యత అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ పేద విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకువచ్చే బాధ్యత టీచర్లపై ఉందన్నారు. నేడు గొప్ప స్థానాల్లో ఉన్నవారందరూ ప్రభుత్వ బడుల్లో చదివిన వారేనని గుర్తు చేశారు. విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సత్తాచాటి ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ఆ దిశగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశను అనుభవించి వచ్చిన వారేనని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను గౌరవించుకోవడం మన బాధ్యత అన్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఈఓ రేణుకాదేవి, ఆయా మండలాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఓటరు జాబితా రూపకల్పనలో నిమగ్నమైన అధికారులు

ఓటర్ల లెక్క తేల్చండి

- ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ
- జిల్లాలో 585 గ్రామ పంచాయతీలు, 4,982 వార్డులు
- 13న మొదటి విడత ఓటరు జాబితా ప్రదర్శన
- 18న రాజకీయ పార్టీలతో సమావేశం
- 28న ఓటరు తుది జాబితా
- రీ నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

బషీరాబాద్: ఈ నెలాఖరు లోగా జిల్లాలోని గ్రామీణ ఓటర్ల లెక్కలు తేల్చాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. గురువారం ఇందుకు సంబంధించి రీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటికే పంచాయతీల వారీగా వార్డుల్లో కుటుంబాల విలీన ప్రక్రియ పూర్తి చేసిన పంచాయతీరాజ్ అధికారులు, కొత్త ఓటర్ల లెక్కలు తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో 585 గ్రామ పంచాయతీలు, 4,982 వార్డులు ఉన్నాయి. గతంలో రాష్ట్ర ఎన్నికల సంఘం సెప్టెంబర్ 5వ తేదీ నాటికి పంచాయతీల్లో ఓటర్ల తుది జాబితాను ప్రదర్శించాలని ఆదేశించింది. కానీ వారం రోజులుగా భారీ వర్షాలు, వరుస సెలవులు రావడంతో దాన్ని ఈ నెల 28 వరకు పొడగిస్తూ గురువారం రీ నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రామాల్లోని కుటుంబాల ఓట్లను జాబితాలో ఒకే వరుసలో, ఒకే వార్డులో ఉండేలా విలీన ప్రక్రియను అధికార యంత్రాంగం దాదాపు పూర్తి చేసింది. కొత్తగా తయారు చేసిన ఓటరు జాబితాను ఈ నెల 13న జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించాల్సి ఉంది. 14 నుంచి 21వ తేదీ వరకు ఓటర్ల నుంచి వచ్చే అభ్యర్థనలను తీసుకుంటారు. 18న జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తారు. 19న మండలాల్లో రాజకీయ నేతలతో సమావేశాలు నిర్వహించి సూచనలు, సలహాలు స్వీకరిస్తారు. 28న జిల్లా గ్రామీణ ఓటర్ల తుది జాబితాను అధికారికంగా విడుదల చేస్తారు.

నెలాఖరుకు ప్రక్రియ పూర్తి చేస్తాం

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఈ నెల 28న జిల్లాలోని పంచాయతీల్లో ఓటరు తుది జాబితాను విడుదల చేస్తాం. 13న మండల స్థాయిలో మరో జాబితాను ప్రదర్శిస్తాం. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే కార్యదర్శులు లేదా ఎంపీడీఓకు ఫిర్యాదు చేయవచ్చు. వారి అభ్యంతరాలను పరిశీలించి సరైనవైతే పరిష్కరిస్తారు. మార్పులు, చేర్పులు ఉంటే సరి చేస్తాం.

– సంధ్యారాణి, డీపీఓ



మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్

పని చేతకాకపోతే వెళ్లిపోండి

- వ్యవస్థలో అందరూ సమానమే
- డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్
- పెద్దేముల్ పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు
- కాలం చెల్లిన మందులు ఉండటంతో ఆగ్రహం

పెద్దేముల్: విధి నిర్వహణలో అలసత్వాన్ని ఉపేక్షించేది లేదని, పని చేతకాకపోతే వెళ్లిపోవాలని డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్ యాదవ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాఫ్ రిజిస్టర్, మందుల స్టాక్‌ను పరిశీలించారు. ఏడాది క్రితం వచ్చిన మందుల వివరాలు రిజిస్టర్‌లో ఎంట్రీ చేయకపోవడంపై మండిపడ్డారు. కాలం చెల్లిన ఐరన్ మాత్రలు ఉండటంతో ఫార్మసీ సిస్టర్ పల్లవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు చదివే వచ్చారా లేక డబ్బులిచ్చి ఉద్యోగంలో చేరారా అని మండిపడ్డారు. ఆస్పత్రిలో ఉన్న మందులకు బ్యాచ్ నంబర్లకు పొంతన లేదన్నారు. ప్రతి మందు పేదలకు అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేస్తోందని తెలిపారు. పీహెచ్‌సీకి పంపిణీ చేసిన మాత్రలు ఎటు పోయాయని ప్రశ్నించారు. ప్రతి 15 రోజులకు ఒక్కసారి మందుల రిజిస్టర్‌ను ఎందుకు చెక్ చేయడం లేదని డాక్టర్‌ని ప్రశ్నించారు. ఇప్పటికైనా వచ్చిన స్టాక్, పోయిన స్టాక్ వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. రిజిస్టర్‌లో ఎంట్రీ కాని మందుల వివరాలపై విచారణ చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్ యాదవ్‌కు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 33 మంది డాక్టర్లకు గాను 20 మంది ఉన్నారని, త్వరలో ఖాళీలను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఏఎన్‌ఎం, ఆశ వర్కలతో సమావేశమయ్యారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదని హెచ్చరించారు. పెద్దేముల్ ఇన్‌చార్జ్ డాక్టర్ బుచ్చిబాబుకు జిల్లా ఇమునైజేషన్ అధికారి బాధ్యతలు ఉన్నందున కందనెల్లిలో పనిచేస్తున్న ప్రమోద్‌ను పెద్దేముల్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిపారు. సౌత్ రైల్వే ఏసీ కోచ్‌లో ఉండాల్సిన తెల్లని క్లాత్ డాక్టర్ టేబుల్‌పై ఉండటంతో ఇది ఇక్కడికి ఎలా వచ్చిందని సిబ్బందిని ప్రశ్నించారు. ఆస్పత్రి ప్రారంభించిన రోజు నుంచి ఉందని వివరణ ఇచ్చారు. దీనిపై కూడా విచారణ జరపాలని ఆదేశించారు.

ఫార్మాసిటీని అడ్డుకుంటాం

- యాచారంలో పర్యటించిన కొడంగల్ నియోజకవర్గ రైతులు
- ఇక్కడి రైతుల స్ఫూర్తితో పోరాటం చేస్తామని వెల్లడి

యాచారం: సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ రైతులు గురువారం యాచారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. కొడంగల్‌లోని దుద్యాల మండలంలో సర్కారు ఫార్మాసిటీని ఏర్పాటు చేయడానికి నిర్ణయించిన నేపథ్యంలో ఆ మండల పరిధిలోని లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, ఆర్బీతండా, పులిచర్లకుంటతండా, ఈర్లపల్లితండాలకు చెందిన 20 మంది రైతులు యాచారంలో పర్యటన చేశారు. గత బీఆర్‌ఎస్ సర్కారు ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని 10 గ్రామాల్లోని 19,333 ఎకరాల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది తెలిసిందే. దీనిని ఈ ప్రాంత రైతులు ఏ విధంగా అడ్డుకున్నారు, పోరాటాలు ఎలా చేశారు, న్యాయస్థానాలకు ఎలా వెళ్లారు.. తదితర వివరాలను స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు కావాలనే మా కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మాసిటీని ఏర్పాటు చేయడానికి నిర్ణయించిందని ఆ మండల రైతులు ఆరోపించారు. మీ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని ఫార్మాసిటీని ఏర్పాటు చేయకుండా అడ్డుకుంటామని ప్రకటించారు. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లో పర్యటించారు. కొడంగల్ రైతులకు ఆయా గ్రామాల అన్నదాతలు తమ పోరాటాలను తెలియజేసి ధైర్యం నూరి పోశారు.

పేదల హితం.. వారి అభిమతం

బాధల్లో ఉన్న వారికి భరోసా కల్పించే నాలుగు మాటలు చెబితే కొండంత బలాన్ని ఇస్తుంది.. వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుంది.. అదే వారి కష్టాల్లో పాలుపంచుకుంటే అంతకుమించిన సాయం మరొకటి ఉండదు.. కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇదే బాటలో నడుస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఓ పక్క పాఠశాలల్లో బోధన చేస్తూనే.. మరో పక్క సమాజ సేవలో భాగస్వాములవుతున్నారు. ఎందరో పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. పేద రైతుల సాగు కష్టాలు తీరుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



పేద మహిళకు ఆవును అందజేస్తున్న సంస్థ సభ్యులు

- ఉపాధ్యాయ విధులు నిర్వహిస్తూనే.. సమాజ సేవలో..
- బృందంగా ఏర్పడి పేదలకు అండగా..
- విద్యార్థుల పైచదువులకు ఆర్థిక సాయం
- రైతులకు విత్తనాలు, ఆవుల పంపిణీ
- కరోనా కష్ట సమయంలో కిట్లు అందజేత

దుద్యాల్: దుద్యాల్, బొంరాస్‌పేట మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న కొందరు ఉపాధ్యాయులుగా ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. పేద విద్యార్థులు, కష్టాల్లో ఉన్న రైతులకు, వ్యాధుల బారిన పడి వైద్యం చేయించుకోలేని వారికి ఆర్థిక సాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. దుద్యాల్, బొంరాస్‌పేట, కొడంగల్ మండలాల ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న రాంరెడ్డి, ఉపాధ్యాయులు రవీందర్ గౌడ్(దుద్యాల్ జెడ్పీహెచ్‌ఎస్, గౌరారం), గోపాల్ (టైకుల్‌గడ్డ తండా), బాకారం చంద్రశేఖర్ (బొంరాస్‌పేట జెడ్పీహెచ్‌ఎస్), పల్నాటి అనిల్ (బొంరాస్‌పేట జెడ్పీహెచ్‌ఎస్), విజయలక్ష్మి (బోజనగడ్డ తండా ప్రాథమిక పాఠశాల), లక్ష్మి (బొంరాస్‌పేట్ ప్రాథమిక పాఠశాల) కలిసి విద్యావంతుల వేదిక ద్వారా ఒక్కటయ్యారు. ఎలాగైనా పేదలకు సేవ చేయాలని భావించారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని కొన్ని ఐటీ కంపెనీల సహకారంతో యూత్ ఫర్ సేవ, కిసాన్ బంధు, స్టేట్ స్ట్రీట్ అనే సంస్థలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు బ్యాగులు, ప్లేట్లు, గ్లాసులు వంటివి అందజేస్తున్నారు. జిల్లాలోని మద్దులు చిట్టంపల్లికి చెందిన విష్ణుప్రియ ఎంబీబీఎస్ చదువు పూర్తయ్యే వరకు మొత్తం ఖర్చు వీరే భరిస్తున్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ చదివేందుకు ఆర్థిక స్తోమత లేని వందలాది మంది విద్యార్థులకు ఫీజులు చెల్లిస్తున్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలను దత్తత తీసుకొని చదివిస్తున్నారు. పేద, కుటుంబ పెద్ద లేని మహిళలకు కుట్టు మిషన్లు, పేద రైతులకు విత్తనాలు, పాడి పరిశ్రమపై మక్కువ ఉన్న వారికి ఆవులు కొనుగోలు చేసి ఇస్తున్నారు. 2013 నుంచి ఇప్పటి వరకు దాదాపు పేదల కోసం రూ.కోటికి పైగా ఖర్చు చేశారు.

కరోనా కష్ట సమయంలో..

యావత్ ప్రపంచాన్ని వణికించిన కరోనా కష్ట కాలంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నిత్యావసర సరుకులు పంపిణీ చేసి ఆదుకున్నారు. కరోనా కిట్లు, ఆక్సిజన్ మిషన్లు, సిలిండర్లు అందజేశారు. ఒక్క కరోనా సమయంలోనే దాదాపు రూ.80 లక్షల వరకు ఖర్చు చేసినట్లు ఉపాధ్యాయ బృందం తెలిపింది. భవిష్యత్తులో కూడా ఇదే తరహా సేవలతో ముందుకు సాగుతామని వారు పేర్కొన్నారు.



విద్యార్థి పైచదువు కోసం ఆర్థిక సాయం చేస్తున్న ఉపాధ్యాయ బృందం

అందరి సహకారంతో..

తాము నెలకొల్పిన సంస్థ ద్వారా 2013 నుంచి ఇప్పటి వరకు పేదల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాం. ఉపాధ్యాయ బృందం సహకారంతోనే ఇది సాధ్యమవుతోంది. కరోనా సమయంలో చాలా మంది ప్రాణాలు కాపాడామన్న తృప్తి మాలో ఉంది. మా బృందం చేస్తున్న సేవలకు, సహాయానికి పలువురి సహకారం ఉంది. కష్టాల్లో ఉన్న వారికి సాయం చేద్దామంటే బృందంలోని ఏ ఒక్కరూ అడ్డు చెప్పరు. మునుముందు కూడా ఇదే తరహా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం.

– రవీందర్ గౌడ్, ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్‌ఎస్ దుద్యాల్ (సంస్థ సభ్యుడు)

గ్రామీణాభివృద్ధిలో నాబార్డు కీలక పాత్ర

- టెస్కాబ్ వైస్ చైర్మన్ సత్తయ్య

తుర్కయంజాల్: గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు.. రైతు సంక్షేమానికి నాబార్డు కీలక పాత్ర పోషించనుందని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, నాబార్డు సీజీఎం చింతల సుశీల అన్నారు. మున్సిపల్ పరిధి రాగన్నగూడలో ఏర్పాటు చేసిన నాబార్డు జిల్లా క్లస్టర్ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. గతంలో కార్యాలయం నగరంలో ఉండటంతో రైతులు ఇబ్బంది పడ్డారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని స్థానికంగా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యాలయం రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, హైదరాబాద్‌కు చెందిన వారికి అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాబార్డు డీజీఎం శ్వేతాసింగ్, ఆర్‌బీఐ ఏజీఎం లక్ష్మీ శ్రావ్య, డీడీఎంలు అఖిల్ పున్నా, హర్ష రఘురామ్, కమర్షియల్ బ్యాంకులు, సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



క్లస్టర్ కార్యాలయ ప్రారంభోత్సవంలో డీసీసీబీ చైర్మన్ తదితరులు

క్లుప్తంగా

మాజీ మంత్రి మాణిక్‌రావుకు ఘన నివాళి



మాణిక్‌రావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాండూరు: నియోజకవర్గంలో ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలన్నీ మాజీ మంత్రి మాణిక్‌రావు హయంలోనే జరిగాయని రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడు రమేష్ మహరాజ్ అన్నారు. గురువారం పట్టణంలోని మాణిక్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఎద్దు మృతి



ఎద్దు కళేబరం

ధారూరు: మండలంలోని స్టేషన్‌ధారూరు గ్రామ సమీప పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లిన ఓ ఎద్దు విద్యుత్ షాక్‌కు గురై గురువారం మృతి చెందింది. రైతు లాల్‌కోట గోరెప్ప ఉదయం తన ఎడ్లను తీసుకుని వ్యవసాయ పొలానికి వెళ్లాడు. పొలం గట్టుపై మేతకు వదిలిపెట్టి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యాడు. మేత మేస్తున్న ఓ ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగా తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఎద్దు విలువ రూ.50 వేల వరకు ఉంటుందని, తనను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు విజ్ఞప్తి చేశారు.

బీసీ కులగణన చేపట్టండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ నాయకులు

అనంతగిరి: ప్రభుత్వం వెంటనే బీసీ కులగణన చేయాలని రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ గారిగే మల్లేశ్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను జిల్లా బీసీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా బీసీల కులగణన లేనందున అన్యాయానికి గురయ్యారన్నారు. ప్రభుత్వం వెంటనే కులగణన చేశాకే స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరియాదవ్, రాష్ట్ర బీసీ సంఘం యూత్ అధ్యక్షుడు నీల వెంకటేష్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు అంజి, ప్రధాన కార్యదర్శి రవియాదవ్, సతీష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కుల్కచర్ల: మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వర స్వామి దేవస్థానం చిన్నజాతరను పురస్కరించుకుని గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారి హుండీని లెక్కించగా రూ.2,85,320 ఆదాయం వచ్చిందని ఆలయ చైర్మన్ నర్సమ్మ రాములు, ఈఓ సుధాకర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయాభివృద్ధికి నిర్విరామంగా కృషి చేస్తున్నామన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమ పర్యవేక్షకుడు మధుబాబు, అర్చకులు పాండుశర్మ, ఆలయ సిబ్బంది, భక్తులు, బండవెల్కిచర్ల గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

డబ్బులిస్తేనే బాబా దర్శనం!

పైసలు ఉంటేనే పరమాత్ముడి దర్శనం అనేది బహిరంగ రహస్యమే. ఇది విపరీతంగా మారడం భక్తుల పాలిట శాపంగా పరిణమించింది. సుదూర ప్రాంతాల నుంచి బాబా దర్శనానికి వచ్చిన భక్తుల ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. వేలాది రూపాయలు హుండీలో వేస్తేనే దర్శనం అంటూ హుకుం జారీ చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..

- జేపీదర్గా హుండీ టెండర్ నిర్వాహకుల హుకుం
- భక్తులను దోచుకుంటున్న కాంట్రాక్టర్లు
- ఇదేమని ప్రశ్నించిన వారిపై దాడులు
- పట్టించుకోని వక్ఫ్‌బోర్డు



జేపీదర్గా

కొత్తూరు: ప్రఖ్యాతి గాంచిన జేపీదర్గాకు తెలంగాణ, పొరుగు రాష్ట్రాల భక్తులు బాబ దర్శనం కోసం ఇక్కడికి వస్తుంటారు. ఇదే అదనుగా భావించిన హుండీ టెండర్లు దక్కించుకున్న వారితో పాటు అక్కడి పలువురు వ్యాపారులు నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. తాము కోట్ల రూపాయలు వెచ్చించి టెండర్లు దక్కించుకున్నామని, ఇదే తరహాలో భక్తుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తామంటూ పేర్కొనడం గమనార్హం.

రూ.2 వేలు ఇస్తేనే..

హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి తన మొక్కుబడిలో భాగంగా నెల క్రితం జేపీ దర్గాలో న్యాజ్(కందూరు) నిర్వహించాడు. అనంతరం బాబా దర్శనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి దర్గాలోకి వెళ్లాడు. అక్కడి హుండీ టెండర్ల నిర్వాహకులు గల్లలో రూ.2 వేలు వేస్తేనే దర్శనం అనగా.. ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎవరికైనా చెప్పుకోండి.. పైసలు ఇస్తేనే బాబా దర్శనమని దబాయించడంతో పదిహేను వందల రూపాయలు సమర్పించుకున్నాడు.

పోలీసులను ఆశ్రయించిన భక్తుడు

రెండు నెలల క్రితం షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన ఓ వ్యక్తి దర్గాలో న్యాజ్ నిర్వహించాడు. అనంతరం బాబాకు నైవేద్యం సమర్పించాడు. దర్శనం కోసం కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి లోపలికి వెళ్లగా.. అక్కడి వారు రూ.3 వేలు హుండీలో వేయాలన్నారు. దీనికి నిరాకరించిన భక్తుడు.. తాను అంత ఇచ్చుకోలేనని చెప్పగా.. నిర్వాహకులు అతన్ని తోసి వేశారు. అంతటితో ఆగకుండా.. దౌర్జన్యానికి పాల్పడినట్లు బాధితుడు వాపోయాడు. ఇదే ఘటనపై సదరు భక్తుడు పోలీసులను ఆశ్రయించాడు. వీరి ఆగడాల నేపథ్యంలో దర్గా దర్శనానికి భక్తుల రాక తగ్గినట్లు ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు.

భౌతిక దాడులు

దర్గా ఆవరణలో పూలు విక్రయించే వ్యాపారులు దర్శనం కోసం వచ్చే భక్తుల వాహనాలను తమ షెడ్డు వద్దే నిలపాలని డిమాండ్ చేస్తున్నారు. మరోచోట వాహనం నిలిపి పూలు తీసుకుంటామని భక్తులు చెప్పినా, వినకుండా ఇక్కడే ఉంచాలని దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. వీరి చేష్టలకు విసిగి.. ప్రశ్నించిన వారిపై వ్యాపారులు దాడులకు పాల్పడుతున్నారు.

పట్టించుకోని వక్ఫ్‌బోర్డు

జేపీదర్గా హుండీ టెండర్లను వక్ఫ్‌బోర్డు ఏటా నిర్వహిస్తుంది. టెండర్లను దక్కించుకోవడానికి వ్యాపారులు పోటీ పడుతుంటారు. రూ.కోట్లు వెచ్చించి దక్కించుకుంటారు. అనంతరం పెట్టిన పెట్టుబడితో పాటు.. లాభాలు రాబట్టుకునేందుకు భక్తుల ముక్కు పిండి వసూళ్లకు పాల్పడుతున్నారు. వేలాది రూపాయలు హుండీలో వేయాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఇదే విషయం పలువురు భక్తులు.. వక్ఫ్‌బోర్డు అధికారుల దృష్టికి వెళ్లినా, వారు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టంగా వ్యవహరిస్తున్నారు.

“వసూళ్లకు పాల్పడవద్దు



దర్గా దర్శనానికి వచ్చిన భక్తుల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడవద్దు. భక్తులను గౌరవించడం నేర్చుకోవాలి. దర్గాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. స్థానికులు, భక్తులు, వ్యాపారులు అన్ని విధాలుగా సహకరించాలి. భక్తులకు ఇబ్బందులు కలిగించే వారు తమ తీరును మార్చుకోవాలి.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

చర్యలు తప్పవు



బాబా దర్శనం కోసం వచ్చే భక్తులను వ్యాపారులు ఇబ్బంది పెట్టవద్దు. వారిని ఇబ్బందులకు గురిచేసినా.. దాడులు చేసినా సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. నిర్వాహకులు, వ్యాపారులు నిబంధనలు పాటించాలి. భౌతిక దాడులకు పాల్పడినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. కేసులు నమోదు చేస్తాం.

– నర్సింహారావు, సీఐ, కొత్తూరు

సాగులో ముందస్తు జాగ్రత్తలు ముఖ్యం

ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ లక్ష్మణ్



పత్తిపంటను పరిశీలిస్తున్న అధికారులు

ధారూరు: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానలకు పంటలు సాగుచేసిన రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తాండూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ లక్ష్మణ్, శాస్త్రవేత్త యమున పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రుద్రారంలో వానలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అతివృష్టితో మొక్కజన్న, పత్తి, కంది తదితర పంట పొలాల్లో నీరు నిలిచిందన్నారు. మొక్కల సాళ్ల మధ్యన నీరు నిల్వకుండా బయటకు పోయేలా చూసుకోవాలన్నారు. వర్షాలకు పత్తి మొక్కలు పసుపు రంగులోకి మారే అవకాశం ఉందని, ఇందుకోసం 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 19:19:19 మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అధిక తేమతో పత్తి మొక్కలను వేరుకుళ్లు తెగులు సోకే అవకాశం ఉందని, దీనికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, లేదా ఒక గ్రాము కార్బండిజమ్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని వివరించారు. మొక్కజొన్న పంటలో భూసారం లోపంతో మొక్కలు ఊదారంగులోకి మారే అవకాశం ఉందని, దానికి పొటాషియం నైట్రేట్, లేదా 19:19:19 మందును పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సంతోష్, రైతులు పాల్గొన్నారు.

చిలకవాగు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణ పరిధిలోని చిలకవాగు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక బీజేపీ నాయకులు గురువారం కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రం అందజేశారు. సహజసిద్ధంగా పారుతున్న చిలకవాగును కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడంతో పట్టణంలోని ఐదు వార్డులలోకి వరద నీరు చేరుకుని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ ఇష్టానుసారంగా చిలకవాగు ప్రవాహ మార్గాన్ని మార్చి వ్యాపారం చేశారని ఆరోపించారు. వాగు నాలా మార్గాన్ని కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని విన్నవించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, ఉపాధ్యక్షురాలు లలిత, కౌన్సిలర్లు బాలప్ప, లావణ్య, పూజ, సాహు శ్రీలత, నాయకులు భద్రేశ్వర్, రజనీకాంత్, మల్లేశం, కిరణ్, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

యాలాల ఎస్‌ఐ శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ శంకర్

యాలాల: వినాయక చవితి పండగ నేపథ్యంలో మండపాల వద్ద, నిమజ్జన రోజున డీజేలకు అనుమతి లేదని యాలాల ఎస్‌ఐ శంకర్ అన్నారు. గురువారం పీఎస్ ఆవరణలో వివిధ గ్రామాలకు చెందిన మత పెద్దలు, యువజన సంఘ నాయకులు, నిర్వాహకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పోలీసు శాఖ అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల వద్ద 24 గంటల పాటు ఒకరు ఉండాల్సిందేనన్నారు. నిమజ్జన రోజున ఇతర మతాలకు చెందిన ప్రార్థన మందిరాల వద్ద రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ యాదయ్యగౌడ్, హెడ్ కానిస్టేబుల్ రాజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, హన్మంతు, మధుసూదన్‌రెడ్డి, నాయకులు లక్ష్మయ్యముదిరాజ్, వెంకటయ్య, జనార్దన్‌రెడ్డి, ఖాసీం, అమర్ తదితరులు ఉన్నారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం



తాండూరు: ఎమ్మెల్యేకు చెక్కును అందిస్తున్న ఫ్రెండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: వినాయక చవితి రోజున మట్టి విగ్రహాలనే పూజిద్దామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వినాయక చవితి ఉత్సవాలను తాండూరు నియోజకవర్గ ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలన్నారు. మట్టి వినాయకులను పూజించడంతో పర్యావరణ పరిరక్షణకు ఎలాంటి ముప్పు ఉండదన్నారు. ఫ్రెండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు మట్టి వినాయకులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఫ్రెండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు విరాళంగా రూ.1,01,000 చెక్కును ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తుల్జారాంసింగ్, దాత శ్రీనివాస్, నాయకులు నర్సింహులు, వీరేందర్, రాధాకృష్ణ, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



భీంకుమార్, సీఐ

ధారూరు: ధారూరు సర్కిల్ సీఐగా భీంకుమార్ బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఆయన గద్వాల సీఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతేడాది జూలై 5న సీఐగా వచ్చిన రామకృష్ణకు ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు అందాయి. దీంతో ఆయన గురువారం ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేశారు.

పంచాయతీ కార్యదర్శుల సస్పెండ్

పెద్దేముల్: మండలానికి చెందిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ జర్నప్ప గురువారం తెలిపారు. ఓంలానాయక్‌తండా కార్యదర్శి వెంకటచైతన్య, ఇందూరు కార్యదర్శి కిషోర్‌లపై వేటు వేశారు. వీరి స్థానంలో రజిత, బలరాంలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మండల అధికారులు గ్రామాలను సందర్శించిన సమయంలో జీపీ కార్యదర్శులు అందుబాటులో లేక పోవడం, గ్రామస్తుల నుంచి విపరీతమైన ఫిర్యాదులు రావడంతో వారిని సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

మాజీ ఎంపీటీసీ సహకారంతో వలంటీర్ నియామకం

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో చేగిరెడ్డి ఘనాపూర్ ప్రాథమిక పాఠశాలకు వలంటీర్‌ను నియమించారు. గ్రామానికి చెందిన అనూషను నెలకు రూ.2వేల వేతనం ఇస్తానని హామీ ఇచ్చి వలంటీర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు అభినందించారు.

పాపన్న గౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకం



పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అంబర్‌పేట: బడుగు బలహీన వర్గాల రాజ్యాధికారం కోసం సర్దార్ సర్వాయి పాపన్న చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అంబర్‌పేట గౌడ్ సంఘం ఆధ్వర్యంలో ఇక్కడ ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్‌లతో కలిసి మంత్రి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలు రాజ్యాధికారం కోసం నిరంతరం పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, కార్పొరేటర్లు విజయ్ కుమార్ గౌడ్, పద్మా వెంకట్‌రెడ్డి, దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శంభుల ఉష శ్రీకాంత్ గౌడ్, గౌడ్ సంఘం చైర్మన్ పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, అధ్యక్షుడు బింది రాజ్‌గౌడ్, ఉపాధ్యక్షులు రమేశ్‌గౌడ్, రంగనాథ్ గౌడ్ పాల్గొన్నారు.

రైతులపై దురుసు ప్రవర్తన

నవాబుపేట: తీసుకున్న రుణాల రెన్యూవల్ కోసం బ్యాంక్‌కు వెళితే తమపై కెనరా బ్యాంక్ సిబ్బంది అసభ్యంగా ప్రవర్తించారని రైతులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని పూలపల్లి(నారే గూడ) కెనరా బ్యాంకులో పనిచేసే ఫీల్డ్ ఆఫీసర్ శ్యామ్ రైతుల పట్ల అవమానకరంగా మాట్లాడాడని పలువురు అన్నదాతలు పేర్కొన్నారు. తీసుకున్న రుణాలను రెన్యూవల్ చేయడానికి పోతే పది రోజుల నుంచి బ్యాంకు చుట్టూ తిప్పించుకుంటున్నారన్నారు. రెన్యూవల్ విషయంలో ఎందుకు ఆలస్యమవుతుందని రైతులు నిలదీయగా.. సిబ్బంది అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు. తమ పట్ల బ్యాంకు సిబ్బంది వ్యవహరించిన తీరు ఏమాత్రం సమంజసం కాదని రైతులు మండిపడ్డారు. ఈ విషయమై కెనరా బ్యాంక్ డీఎం చక్రధర్ రెడ్డిని సంప్రదించగా రైతుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అర్హులకు డబుల్ ఇళ్లు కేటాయించాలి

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి శివారులో నిర్మించి, మున్సిపాలిటీకి కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులకే కేటాయించాలని ప్రస్తుత మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీకి కేటాయించిన సుమారు 150 డబుల్ బెడ్రూం ఇళ్లను ఇష్టారీతిన కాకుండా నిజమైన అర్హులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు అర్హులకు కాకుండా తమకు నచ్చిన వ్యక్తులకు కేటాయిస్తే మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్

తాండూరు రూరల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను కరన్‌కోట్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. తాండూరు మండలం గోపన్‌పల్లి గ్రామం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను కరన్‌కోట్‌కు తరలిస్తున్నారు. దీంతో పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని సమీర్, డ్రైవర్ నగేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పట్టు పురుగుల పెంపకంతో లాభాలు



మల్బరీ సాగును పరిశీలిస్తోన్న జేడీ లత

తలకొండపల్లి: పట్టు పరుగుల పెంపకం (సెరీ కల్చర్)తో అధిక లాభాలు ఆర్జించవచ్చని హైదరాబాద్ పట్టు పరిశ్రమశాఖ జేడీ లత పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో ఏడాదంతా పంటలను తీసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. మండల పరిధిలోని కోరింతకుంట తండా, వెంకట్రావ్‌పేట, హర్యానాయక్ తండాల్లో గురువారం మండల ప్రత్యేకాధికారి ముత్యాలుతో కలిసి ఆమె పర్యటించారు. మల్బరీ తోట, పట్టు పురుగుల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లత మాట్లాడుతూ.. చిన్న, సన్నకారు రైతులు, నిరుద్యోగ యువతకు చక్కటి ఉపాధిని పట్టు పరిశ్రమ శాఖ అందిస్తోందని తెలిపారు. పట్టు పరిశ్రమ శాఖకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. మల్బరీ తోటల పెంపకం నుంచి షెడ్డు నిర్మాణం వరకు.. పట్టు పురుగుల పెంపకం దశ నుంచి మార్కెటింగ్ వరకు అనేక రాయితీలను ప్రభుత్వాలు అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది



పరిగి: ఉత్తమ గురువులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తదితరులు



యాలాల: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు

ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రె

పరిగి: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పరిగి, పూడూర్, దోమ మండలాల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భావితరాలకు ఉపాధ్యాయులే ఆదర్శమన్నారు. దేశ భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లో ఉంటుందన్నారు. ఉన్నతమైన విద్యార్థిగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయుడు అహర్నిశలు కృషి చేస్తారన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా విద్యాబుద్ధులు నేర్పాలన్నారు. మన దేశం నుంచి ఎంతో మందిని విదేశాల్లో ఉన్నత స్థానంలో నిలిపించారంటే అది కేవలం ఉపాధ్యాయుల కృషి వల్లే సాధ్యమైందన్నారు. మంచి విధులు నిర్వహించి విద్యాబోధనలు చేస్తే వారి సేవలు చిరకాలంగా గుర్తుంటాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ హరిశ్చందర్, మాజీ ఎంపీపీ అనసూయ, డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, పార్టీ దోమ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఆయా మండలాల ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో ముగ్గురికి అవార్డులు

యాలాల: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల్లో మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. మండల పరిధిలోని అగ్గనూరు పీఎస్ హెచ్‌ఎం సంగెం మొగులయ్య, అదే పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న ఎం.మురహరినాథ్, యాలాల మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల సీఆర్‌టీ కృష్ణవేణిలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. గురువారం స్పీకర్, కలెక్టర్, డీఈఓ చేతుల మీదుగా అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో గుర్తింపు రావడం పట్ల ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎంఈఓ సుధాకర్‌రెడ్డి అభినందనలు తెలిపారు.